

# అతకని బతుకులు

తన జీవితం నాశనమైనా అందుకు బాధ్యులైనవారి తప్పులను క్షమించగల శక్తి ఉత్తముడైన వ్యక్తికి ఉంటుంది. గతమంతా తుడిచివేసి జీవితంపట్ల తిరిగి ఆసక్తి కలుగజేస్తే ఆ క్షమా హృదయునికి ఎదుటి వ్యక్తి ఆత్మార్పణ చేసుకోనూవచ్చు. కాని ఆ తప్పు మూలంగా వేరొకరు హృదయ మార్దవం కోల్పోతే పరిణామాలు ఎలాఉంటాయో ఎవరు చెప్పగలరు?

---

"నమస్కారం" అన్నమాట వినగానే వ్రాసుకుంటూ ఉన్నదల్లా తలయెత్తి చూచిన సుమతీదేవి, రెండుచేతులూ జోడించి మందహాసం చేస్తున్న వ్యక్తిని చూసి విచలితురాలయిపోయింది. మనస్సు పనిచేయటం మానుకుంది. రెండు గుడ్ల

---

గొంట్లా సత్యనారాయణ

# అతకని బ్రతుకులు

అలా అప్పగించి చూస్తూ ఉండిపోయింది. ఆమెకు కాలం నిలిచిపోయినట్లనిపించింది. ఇరువదినాలుగు సంవత్సరాలనాడు తనకు తాళికట్టిన భర్త ఇలానే పిల్కుసూటు, సిల్కుపై ఎర్రని గీరలు కల టై, తెల్లని చొక్కా, ఉంగరాల క్రాపు, నవ్వుతూ ఉన్న కళ్ళతో తన్ను పెళ్ళిచూపులు చూడటానికి వచ్చాడు. ఆ దినం అతడు వచ్చి ఇలానే ఎంతో సంస్కార హృదయంతో నమస్కరించి తాను కూర్చున్నంతవరకూ కూర్చోలేదు. ఎంతో అయిష్టతతో, క్రోధంతో పెండ్లి చూపులకు ఒప్పుకున్న తాను ఆ నిష్కళంకమైన చిరునవ్వు ఎదుట నిరాయుధురాలయి పోయింది... అదేవ్యక్తి, మరల ఇరువది నాలుగు సంవత్సరాల తర్వాత అదే రూపంతో దర్శన మిచ్చాడని నమ్మ లేకుండా ఉంది. అలా ఎంతసేపు వచ్చిన వ్యక్తిని విస్మయురాలయి చూస్తూ ఉండిపోయిందో కాని, ఎదుట నిల్చున్న వ్యక్తి మరల నమస్కరించెప్పి కుర్చీలో కూర్చోగానే సుమతీదేవి ఈలోకంలోకి వచ్చి, అవ్యక్తి ఉద్యోగం కోసం వచ్చిన అభ్యర్థులలో ఎనిమిదోవాడు కదా అని, మేజాపై ఉన్న కాగితాలలో అతడిని గురించి ఉన్న సంగ్రహ చరిత్రను చూడసాగింది. అయితే ఆమె నేత్రాలకు గడిచిన పాతిక సంవత్సరాల నిర్లిప్తమైన జీవితమే మెదలసాగింది. కాగితాలలోని అక్షరాలు కానరావటం లేదు.

"ఏ ఊరు?" యాంత్రికంగా అడిగింది.

"కనిగిరి — నెల్లూరు జిల్లా. ఆంధ్ర" అన్నాడు. ఆ కంఠం వినగానే అదిరిపడింది. అదేస్వరం..... తన పాపాలను శిక్షించడానికి ఇలా రాలేదుకదా అనుకుంది. ఆ యోచన వచ్చినందుకు మరుక్షణంలో నవ్వుకుంది. లోకానికి ఎదురీదిన తాను ఇలా జేల ఎందుకవుతూంది?

"పేరు?... ఏం చదువుకున్నారు?"

"బి. ఎ. ఆనర్సు. యూనివర్సిటీలో ఫస్టుగా వచ్చాను. ఎకనమిక్సు......"

"ఇదివరకు అనుభవం ఏమైనా ఉందా?"

"లేదండీ. మొన్న మార్చిలోనే పాసు అయినాను.'

అనుభవజ్ఞులు కావాలని అడ్వర్టయిజు చేశాం కదా!" కోల్పోయిన మనోధైర్యం రాసాగింది. పక్కన నిల్చొని ఉన్న పర్సనలు అసిస్టెంటు వైపు చూసి మందహాసం చేసింది.

"అనుభవజ్ఞులయిన మీవద్దనే అనుభవం గడించవచ్చునుగదా?"అతడు చిన్న నవ్వు నవ్వాడు. ఆమె చకితురాలయి అతనివైపు తీక్షణంగా చూసింది. కాని, ఆ చూపుల్లో శక్తిలేదు. అతని సుందర రూపం చూడగానే శక్తివిహీనురాలయి పోయింది. కాని, అతడు తనకంటె ఎంత చిన్నవాడు! అతడు కూడ తనను సునిశితంగా పరీక్షిస్తూ ఉండటం చూసి హృదయం చిరు కోపంతో నిండిపోయింది. కాని, మరుక్షణంలోనే నలుబది సంవత్సరాలు నిండినా, యీ యువకుని దృష్టిని ఆకర్షించగలిగినాననే తృప్తి కోపాన్ని బయటపడనీయలేదు.

".....ఆ... సందేహం ఎందుకు?" ఆమె కిలకిలా నవ్వింది. నవ్వుతున్నదల్లా టేబులుమీద ఆనించి ఉన్న అతని కుడి అరచేతిలోని పుట్టుమచ్చను చూసి షాకు తిన్నదానిలా టక్కున ఆగిపోయి, "మీపేరు చెప్పారు కాదు?" అని తీక్షణంగా అడిగింది.

క్షణక్షణానికి మారిపోతున్న ఆమె వైఖరికి అతనికి ఆశ్చర్యం కలిగింది. ఆమెను గురించి తాను విన్నదాంట్లో ఎంత సత్యం ఉందో అని ఆమె ధరించిఉన్న లిప్‌స్టిక్కును, బాబ్డుజుట్టును, అరంగుళం పొడరును ఛేదించి చూడాలని ప్రయత్నిస్తూ ఉన్న అతడు, ఆమె తీక్షణ స్వరానికి ఆశ్చర్యపోయి ఆమె కళ్ళలోకి కురుచవైపు చూస్తూ నవ్వటానికి ప్రయత్నిస్తూ "యస్. వి. ఆర్. కె. మూర్తి" అన్నాడు. కుర్చీలో ఆనుకొని ఉన్న దల్లా ముందుకు వంగి కాగితంలో దేనికో వెదక సాగింది.

"మీ తండ్రిపేరు?" నెమ్మదిగా అడిగింది.

"పుండరీకాక్షయ్యగారు."

"పూర్తి ఇంటిపేరు?" ఆమె స్వరం ఎంతో క్షీణంగా ఉంది.

"శాంతి...."

ఆమె అలానే స్తంభించి పోయినట్లయింది.

".....బ....య....ట..... ఉండండ" ఏదో లోతు బావిలోనుంచి వచ్చినట్లుంది ఆమె స్వరం. అతడు లేచి నిల్చొని మరల నమస్కరించేసి ఆశ్చర్యంతో బయటికి వెళ్ళాడు. పోతూ ఉన్న అతడిని నిశ్చేష్టురాలయి చూస్తూ ఉండిపోయింది సుమతీదేవి.

## 2

"ఏంరా,మూర్తీ, ఇంటర్వ్యూ యేమైంది?" అని నారాయణ పలకరించేవరకూగాని ఆలోచనల నుంచి తేరుకోలేదు మూర్తి.

"చాలా చిత్రంగా జరిగిందిరా యింటర్వ్యూ. ఆమె మరో లోకంలో ఉన్నట్లు ప్రవర్తించింది. ఎందుకో చాలా ఆవేశపడుతున్నట్లు ఉంది. రేపు ఉదయం ఆమెను ఇంటివద్ద కలుసుకోమని సిందిగా హుకుం....."

నారాయణ పకపక నవ్వాడు. "నెంబరు ముప్పయిఆరు అన్నమాట నీవు. కొట్టవచ్చినట్లుండే నీ అందాన్ని చూచిన ఆ కాముకి మరో లోకంలో ఉండక ఏంచేస్తుందిరా బాబూ? నీమీద మోజు తీరినంతవరకు మంచి జీతం, సౌఖ్యం!... అనుభవించు నాయనా, అనుభవించు. మరో వ్యక్తి రాగానే నీకు గుడ్‌బై యిస్తుంది." అని మరల నవ్వాడు.

"నన్ను చంపక కొంచెం విశదంగా చెప్పు ఆ శిథిల శిల్పాన్ని గురించి." మూర్తి అనగానే నారాయణ మరల నవ్వాడు. మూర్తి ముఖంలోని విసుగుదల చూసిన తర్వాత కాని నవ్వు ఆపుకోలేక పోయాడు.

"అవునురా బాబూ, ఆమె శిథిలశిల్పమే! బహుశా ఆమెను యవ్వనంలో చూసి ఉంటే ఆమె అపూర్వ సౌందర్యానికి, కళా నైపుణ్యానికి జోహారులు అర్పించవలసి వచ్చేది. కాని ఇప్పుడు పారిపోతూన్న యవ్వనాన్ని కట్టివేయాలని ఆమె పడే తాపత్రయాన్ని చూస్తే జాలివేస్తుంది! బాబ్డుజుట్టు ఈ వయస్సులో ఎందుకురా బాబూ! రంగు వేయటంలో పొరపడిన రోజు తెల్లని వెంట్రుకలు తొంగి చూస్తుంటాయి.... కాని నిపస్నట్లు యవ్వనం శిథిలమైనా ఆమెరూపం ఇప్పటికీ అజంతా శిల్పమే!...." అన్నాడు నారాయణ.

"నివ్యంగ్యాన్ని మాని ఆమెను గురించి నిన్నంతవరకు చెప్పరా బాబూ. ఇంటివద్ద కలుసుకోవాలనో, లేదో నిర్ణయించుకోవాలి."

"తప్పకుండా కలుసుకో. నీలాంటి అందగానికి సర్వం అర్పించవచ్చు ఆ శ్రీమంతురాలు ... ఆమెది ఏ ఊరో తెలీదు. స్పష్టమైన ఇంగ్లీషు తప్ప మరో భాష మాట్లాడదు. ఆమె భర్త కృపాల్‌సింగు పది సంవత్సరాల క్రిం ట హఠాత్తుగా చనిపోయేటంతవరకు ఆమెను గురించి మాకు ఆఫీసులో అంతగా తెలీదు. సుమతీదేవి చాలా అందగత్తె అని, ఆమెకు చాలా వింతయిన అభిప్రాయాలు ఉన్నవని, నడవడి అట్టే మంచిదికాదనీ, సింగు ఆమెను నిర్దయగా కొడుతూ ఉండేవాడని పుకార్లు ఉండేవి. కొంత మంది సుమతీదేవి సింగు భార్య కాదని అనే వారు. చనిపోవడానికి ముందు రోజు సింగు ఆఫీసుకు వచ్చాడు. ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడు. మరునాడు మధ్యాహ్నం సింగు చని పోయాడని, దహన సంస్కారాలు జరిగిపోయాయని తెలియగానే ఆఫీసు అంతా ఆశ్చర్య పడింది. కొన్ని రోజులు సింగు మరణం సహజ మరణం కాదని చాలా మంది అన్నారు. కాని సింగుకు సుమతీదేవి తప్ప మరి ఎవ్వరు వారసులు లేరు. పదోరోజున తెల్లని చీర, తెల్లని జాకెట్టు — తెల్లని కంటి అద్దాలు ధరించి బంగారుఛాయను మించే శరీరంతో హుందాగా వచ్చి సింగు కూర్చునే సీటులోనే కూర్చొని ఆఫీసు పనిని సమర్థంగా చేయటానికి పూను కొనేవరకు సుమతీదేవిని ఎవ్వరూ ఏమీ అనలేక పోయారు. ధనం ... విపరీతమైన ధనం సర్వం కప్పివేసింది. ఏ నాలుగు రోజులు నక్రమంగా ఉందో! అంతే! ఈ పది సంవత్సరాలలో 35 మంది పర్సనలు సెక్రటరీలు మారినారు. ఆకర్షవంతమైన జీతం — అందమైన యజమానురాలు — ఉద్యోగం వద్దనేదెవ్వరు? ప్రతివాడు తానే శాశ్వతం అనుకునేవాడు. కాని, ఒక రోజు ఉదయం — మోజుతీరిన క్షణంలో ఒక్క నెల జీతం కాంపెన్సేషను ఇచ్చి సాగనంపేది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# క్రోధి ఉగాది నవలల పోటీ

మొదటి బహుమతి రు 2,000 లు
రెండవ బహుమతి రు 1,000 లు
మూడవ బహుమతి రు 500 లు

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు :

1. రచన 250 పావుతావు కాగితా లకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయరచనలే కాని అనువాదలు పంపరాదు.
5. బహుమతి పొందని నవలలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. రచన పంపేటప్పుడు కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కానివాటిని త్రిప్పి పంపే నిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్ళలు అంటించిన, చిరునామా కలిగిన కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని త్రిప్పి పంపడం జరుగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.

బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది

ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | 1964 ఫిబ్రవరి 29


బహుశా రష్యా చక్రవర్తిని అలెగ్జాండ్రియా విషయం విన్నావనుకుంటాను. రోజు కొక రసికుడు కావలెనట! మరునాడు తల తీయించే దట! ... సుమతీదేవి మాత్రం అతని యవ్వనాన్ని పీల్చి పిప్పిచేసి ఒక్క నెల జీతం ఇచ్చి సాగనంపేది. ఆమెను చేరినవారంతా దీపం చుట్టూ చేరిన పురుగుల్లా నాశనం కావలసిందే. ఆమెమాత్రం దీపంలా యవ్వనాన్ని పుంజుకుంటూ వెలిగిపోతుంది! ... తృప్తి తీరని ఆమె కామ దాహానికి మరెంత మంది ఆహుతి కావలెనో! కొత్తల్లో కొంత బిడియం, సంఘం వెరపు ఉండేవి. ఇప్పుడవేంలేవు. అంతా బాహాటం. విర్మోహమాటంగా కోరి అనుభవిస్తుంది. తాగుతుంది. ఆ ధన మదంలో లోకంతో ఆమెకు అవసరంలేదు. వ్యాపారం లక్షలు సంపాదించి పెడుతూంది సుమతీదేవికి. సుమతీదేవి! ... అంత పవిత్రమైన పేరును ఆమె తల్లి తండ్రులు ఈ భ్రష్టురాలికి ఎందుకు పెట్టారో!"

"అంటే, నారాయణా, ఈ ఉద్యోగం ఆఫీసులో పనిచేయటానికి కాదన్నమాట! ... ఆమె కామతృష్ణ తీర్చటానికన్నమాట! ..."

"అవును బాబూ ... కాని, విను. నీకు అందం ఉంది. యవ్వనం ఉంది. ఆమెకు కావలసినంత డబ్బు ఉంది. పెద్ద వ్యాపారం ఉంది. వయస్సుమళ్ళిన తర్వాత వచ్చిన ప్రియుడవు నీవు... చివరకు ఆమె నీకు ప్రియురాలయి సర్వం నీకు అర్పించుకుంటుందేమో! ... ప్రయత్నించు ..." నారాయణ స్వరంలో వ్యంగ్యం ప్రతిధ్వనించింది.

"ఆగు, నారాయణా! నీవు అన్నట్లు ఆమెలో అన్నీ ఉన్నాయి కాని నీతి లేదు. నాలో ఆ నీతి ఉంది... శిష్టమైన కుటుంబంలో పుట్టాను. చిన్నతనంలోనే మా తల్లి చనిపోయినా, ఇంత వరకు నీతి తప్పనివాడు మా తండ్రి. ఆమెనే తలుచుకుంటూ ఇప్పటివరకు మరల వివాహం సహితం చేసుకోలేదు ... ఎన్నడో మరణించిన మా తల్లి మహాసాధ్వి ... ఏనాడూ డబ్బుకోసం ఆశయాలను అమ్ముకోవని వంశానికి చెందిన వాడిని. ఏదో పెద్ద ఉద్యోగం, అభివృద్ధికి తావచ్చునని ఇంతదూరం బొంబాయికి వచ్చాను. ఇందులో ఇంత తుచ్ఛం ఉందని తెలిస్తే వచ్చే వాణ్ణి కాదు."

"అంటే రేపు ఉదయం ఆమె ఇంటికి పోవన్నమాట!"

మూర్తి వెంటనే జవాబు ఇవ్వలేదు. అతని ముఖ కవళికలు మారాయి. "లేదు ... రేపు ఉదయం ఆమెను తప్పక కలుసుకుంటా. నీవు చెప్పేది నిజమైతే ఆమె ఒక అపూర్వ వ్యక్తిలా ఉంది ... నీవు చెప్పినట్లు ఆమె కామతృష్ణ తీర్చటానికి నిర్ణయింపబడ్డ పనిముట్టునయితే సెలవుచెప్పి వస్తాను."

"జాగ్రత్త, మూర్తీ... క్షీయోపాత్రాను మించిన లావణ్యం, వగలు, మోసం కలిగిన ఆ నిత్యయవ్వనికిమాత్రం బలి కావద్దు." నారాయణ నవ్వుతూ అన్నాడు.

"అలా ఎన్నటికీ జరుగదు." మూర్తి స్వరంలో కనిపించిన కాఠిన్యానికి, దృఢత్వానికి ఆశ్చర్యపడినాడు నారాయణ.

## 3

మలబారు హిల్సులోని సువిశాలమైన భవనం, చక్కని తోట ఆమె ఐశ్వర్యాన్ని చాటుతున్నాయి. ఎనిమిది గంటలకంతా వస్తానన్న మూర్తి పది గంటలకుకాని ఆ ఇల్లు చేరుకోలేకపోయాడు. గేటువద్ద ఉన్న గూర్ఖా సహితం తన్ను చూసి మీసం వెనుక నవ్వును దాచుకున్నట్లు తోచింది. మూర్తి ఏ ఆటంకం లేకుండా హాలులోనికి ప్రవేశించాడు. అందులో ఉన్న కళాఖండాలు, తివాసీలు, సోఫాలు ఆమె సంస్కారాన్ని చాటుతున్నాయి. అంత సౌందర్యవంతంగా అలంకరించి ఉన్న ఆ ఇంటిని చూచి క్షణం ముగ్ధుడయ్యాడు. అతడిని చూడగానే "మీరు రాగానే పైకి పంపమన్నారు ... ఉదయంనుంచి యెదురు చూస్తున్నారు" అని నౌకరు మూర్తికి పైకి దారి చూపాడు.

మెల్లగా పైకి ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ ఉంటే, ఇంత సిరిసంపదలతో తులతూగే సుమతీదేవి, నారాయణ చెప్పినంత దిగజారిపోయిందా అనిపించింది మూర్తికి. నెమ్మదిగా వెళ్ళి గుమ్మానికి అడ్డంగా ఉన్న కర్టెను తొలగించి అక్కడనే నిలబడిపోయాడు. ఆమె ఎదురుగా ఉన్న కిటికీలోనుంచి దూరంగా చూస్తూ, తన వైపు వీపు చూపుతూ, తన ఆలోచనలలో ఉండిపోయినట్లుంది. వెనుక వైపునుంచి చూస్తుంటే, జాకెట్టులోనుండి పైకి వస్తూన్న తెల్లని మెడ, చక్కని పిరుదులు, తెల్లని నైలాను చీరలో మలచినట్లున్న సుందర విగ్రహం అజంతా సుందరిని మరిపిస్తున్నాయి. ఆ బాబ్డు వెంట్రుకలుమాత్రం ఏ గ్రీకు సుందరో అని భ్రమింపచేస్తున్నాయి.

వెనుకనుండి చూస్తుంటే వయస్సులేని నలో మిలా ఉంది ఆమె. తీర్చి దిద్దినట్లున్న సుందర పరిసరాల్లో ఆ అపూర్వ సుందరిని చూస్తుంటే నారాయణ చెప్పిందంతా ఒక్క క్షణం మరిచి పోయి మూర్తి మరో లోకంలో విహరించ సాగాడు. ఆమె ఏకాంతానికి వెంటనే భంగం కలిగించలేకపోయాడు.

అయిదు నిమిషాలకుగాని ఆమె ఇటు తిరుగ లేదు. మూర్తిని గుమ్మంలో చూడగానే ఆమె విశాల నేత్రాలు రెండూ మరీ విప్పారాయి. సంతోషంతో ముందుకు నాలుగు అడుగులు వేసింది.

అంతవరకూ ఆమె వైపు ఏకాగ్రంగా చూస్తున్నవాడల్లా మూర్తి కుంచించుక పోయాడు. కళ్లు రెండూ ఎర్రగా ఉన్నాయి నిన్నటి కంటి అద్దాలు లేవు. కంటి రెప్పల క్రింద నల్లని మచ్చలు ఏర్పడి ఉన్నాయి. లిప్ స్టిక్, ఫేసుపౌడరు ఆమె వయస్సును దాచలే కుండా ఉన్నాయి. ఆమె ముఖంలో తీరని వ్యధ కానవస్తోంది. ఉన్నట్లుండి ఎందుకో ఆమె మీద తీరని జాలి కలిగింది మూర్తికి. వెంటనే నారాయణ అన్న మాటలు జ్ఞాపకం వచ్చి ఒక్క అడుగు వెనక్కి వేశాడు. అది గమనించిన ఆమె టక్కున ఆగిపోయింది. ఆమె ముఖం బాధతో నిండిపోయింది. వెంటనే బాధను దాచుకోటానికి ప్రయత్నిస్తూ నవ్వటానికి ప్రయత్నించింది. కాని, ఎంతో కష్టంమీదగాని నవ్వలేకపోయింది సుమతీదేవి.

"ఏం బాబూ, గుమ్మంలోనే ఆగిపోయావు? నీకోసం యెంతసేపు నుండి యెదురు చూస్తున్నానో తెలుసా?... రాకుండానే పారిపోయావేమో అని బాధ పడ్డాను. రా బాబూ. వచ్చి కూర్చో బాబూ.... "స్వచ్ఛమైన తెలుగులో బాబూ అని ఆప్యాయంగా పిలుస్తున్న ఆమె పిలుపు అతనిని ఆకర్షించింది. నెమ్మదిగా రెండు చేతులూ జోడించి "నమస్కారం" అని ముందుకు రెండు అడుగులు వేశాడు. ఆమె ప్రతి నమస్కారం చేయలేదు. "రా నాయనా, రా. ముసలి దాన్ని చూస్తే భయమా?" అని సుమతీదేవి అతనికి సోఫా చూపింది. ఆ సంబోధన వినగానే ఆశ్చర్యపడి ముందుకు వచ్చి ఆమెకు సమీపంలో సోఫా ముందు నిల్చున్నాడు.

"కూర్చోబాబూ...." ఆమె కంఠం వణికింది.

"మీరు కూర్చోండి ముందు..."

"ఇది ఇల్లు బాబూ. ఆఫీసు కాదు. కూర్చో నాయనా." అతడు మరి మాట్లాడలేక సోఫాలో కూర్చున్నాడు. ఆమె అతి సమీపంలో ఉంది. అతని ముఖంలోకి తేరిపార చూస్తోంది. ఆమె కన్నులు చెమ్మగిలి నట్లనిపించింది మూర్తికి. వెంటనే ఆమె "కూర్చోబాబూ. వెంటనే కాఫీ తెస్తాను. పారిపోకు" అని గబగబా లోనికి పోయింది. ఆమె కంఠం జీరపోయింది. అనుకోని ఈ సంఘటనతో అయోమయంలో పడ్డాడు

# అతకని బ్రతుకులు

మూర్తి. నారాయణ చిత్రించిన సుమతీదేవికి, ఈమెకు ఎంతో తేడా ఉంది. దూరపుకొండలు నునుపు అన్నట్లు పైకి హృదయం లేని స్వార్థ పరురాలైన కాముకిగా కనుపించే సుమతీదేవిలో ఇంత ఆవేదన ఉన్నట్లు ఎంతమందికి తెలుసు? దేనికోసం ఈ ఆవేదన?.....

అరగంట అయినా సుమతీదేవి బయటకు రాలేదు. మూర్తికి ఏమిచేయాలో తోచటం లేదు. లేచి పోదామనుకున్నాడు గాని ఆమెపోతూ పారిపోవద్దని చేసిన హెచ్చరిక తలుచుకొని కదం లేక పోయాడు. ఆమె ఎంతకూ రాకపోయేసరికి ప్రక్కన ఉన్న కిటికీ వద్దకు పోయి నిల్చున్నాడు. దూరాన సముద్రం ఒడ్డును తగులుతూ రాపిడి చేస్తోంది. అదే సముద్రం లోను లోను ఎంతో ప్రశాంతంగా ఉంది. తోటలో క్రిందపడిన కాకిపిల్లను మరల చెట్టుపైకి చేర్చటానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది తల్లికాకి. ఎందుకో పక్షుల్లోకూడ ఈ మమత! తనకేం తెలుసు తల్లిప్రేమ!.... చిన్నతనంలోనే పోయింది. ఇప్పుడు తనకు తల్లి ఉంటే ఎంత బాగుండును! ఆ ఆలోచన రాగానే మూర్తి హృదయం మూగ బాధతో నిండిపోయింది.

"బాబూ...." మెల్లని, తీయని పిలుపు విని తిరిగి చూశాడు. సుమతీదేవి సమీపంలో ఉంది. ఆమె కళ్ళు రెండూ ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ముఖంమీద పౌడరు జాడలేదు. కళ్ళక్రింద చారలుదేరి ఉన్నాయి. ఆమెను చూడగానే అంత వరకూ ఆమె ఎంతో దుఃఖించినట్లు, తననుండి దేన్నో దాచటానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు విశదమయింది. ఎంతో కఠినంగా వ్యవహరించ దలుచుకొని వచ్చిన మూర్తి మెత్తబడి ఆమెవెంట పోయి సోఫాలో కూర్చున్నాడు. ఆమెకూడ అదే సోఫాలో కూర్చొని కాఫీ కలప సాగింది.

"మేనేజరుగా ఉండాలంటే ఎంతో అనుభవం కావాలి. కొంతకాలం నాకు పర్సనలు అసిస్టెంటుగా ఉంటే పని అంతా వస్తుంది....."

తలవంచుకొని ఉన్నవాడల్లా టక్కున తల యెత్తి ఆమెవైపు చూశాడు. ఆమె నిర్వికారంగా తలవంచుకొని కాఫీ కలుపుతూ అంది. నారాయణ అనిన ముప్పదియారో సంఖ్య జ్ఞాపకానికి వచ్చింది.

"నేను ఉండలేనండి....." అతని స్వరంలోని కాఠిన్యాన్ని విని చకితురాలయి, అతనివైపు చూసింది. అతని కళ్ళలోని దృఢసంకల్పాన్ని చూచి ఒక్క క్షణం ఆగిపోయింది.

మరుక్షణమే కాఫీ అతనికి అందిస్తూ "లోకం నన్ను గురించి అనుకున్న మాటలన్నీ విన్నావుకదూ నాయనా" అనింది. ఆమాటలు ఆమె ఎంతో ప్రయత్నం మీద అన్నట్లు ఉంది. కన్నీటిని ఎంతో ప్రయత్నంమీద ఆపుకుంటూ ఉన్నట్లుగా ఉంది. వెంటనే మూర్తి తన

కాఠిన్యానికి సిగ్గుపడిపోయాడు.

"కాదండి......" అని ననగబోయాడు.

"నన్ను అండీ అని పిల్వకు బాబూ. నీకంటే 23 సంవత్సరాలు పెద్దదాన్ని. అమ్మా అని పిలువు...."

అతడు జవాబు చెప్పలేదు.

"ఏం బాబూ అలా పిల్వతగనా?...." ఆమె మాటల్లో ఎంతో ఉద్రేకం ఉంది.

"ఉహూ...." అని తల త్రిప్పాడు. ఆమె అహం దెబ్బతిన్నది. కోపం, ఉద్రేకం వచ్చాయి. "ఏం బాబూ మీతల్లి అంత పవిత్రమయిందా?" అనింది. ఆమె మాటలలోని వ్యంగ్యం అతడిని చెలకోలతో వీపున చరిచినట్లయింది. త్రాగ బోతున్న కాఫీని అచ్చటపెట్టి నిల్చున్నాడు.

"నన్ను కన్నతల్లి పట్టి పవిత్రురాలేకాదు— మహా పవిత్రురాలు, పతివ్రత. మా తండ్రిని గాఢంగా ప్రేమించింది. వారి పవిత్రప్రేమ ఫలితమే నేను. ఆమె నన్ను ఎత్తుకొని పుష్కరాలకు వెళ్ళి అచ్చట కాలుజారి గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయి దుర్మరణం చెందింది. ఆనాడే మా తండ్రి నెలల పిల్లవాడినయిన నన్ను ఎత్తుకొని జన్మస్థానమయిన రాజమండ్రి వదిలి మారుమూలన ఉన్న కనిగిరిలో వైద్యం చేసుకుంటున్నారు. అప్పటికి మా తండ్రికి నిండా పాతిక సంవత్సరాలు లేవు. మరల వివాహం చేసుకోలేదు. అంతేకాదు. మరో స్త్రీమొగం చూచి ఎరుగడు. నన్ను పెంచటంలోను, దైవభక్తిలోను నిమగ్నులయినారు. ఎంత పవిత్రమూర్తి నాతల్లి! ఆమెను పొగడని దినం లేదు మా తండ్రికి. అటువంటి ప్రేమ స్వరూపిణిని కోల్పోయిన నిర్భాగ్యుణ్ణి నేను..... నేను విన్నది నిజమే అయితే..... మిమ్మల్ను ఆ పవిత్రనామంతో పిలువలేను....అంతేకాదు. మాతల్లి జీవించి ఉంటే మీవయస్సే ఉంటుంది. చాలా అందగత్తె అని విన్నాను. బహుశా మీకంటేకూడ అందగత్తె యేమో!.... నా ఊహల్లో, స్వప్నంలో ఆమె పట్టుచీర కట్టుకొని, చక్కని బొట్టుతో ఆప్యాయంగా పలకరిస్తుంది.... ఆమెకూ, ఈబొబ్బు వెంట్రుకలు...... క్షమించండి. ఉద్రేకపడినాను. మీ ఉద్యోగానికి సెలవు. వస్తాను....." అని మూర్తి తలుపువైపు గబగబా నడిచాడు. అంత వరకూ నిశ్చేష్టురాలయి అతని మాటలువింటూ ఉన్న సుమతీదేవి టక్కునలేచి తలుపువద్దకు పరుగెత్తి రెండుచేతులూ చాచి ద్వారానికి అడ్డంగా నిల్చింది.

"ఆగవోయి బాబూ. నేను చెప్పేది అంతా విన్న తర్వాత ఇష్టమైతే వెళ్ళిపో. కాని ముందు పోనివ్వను..... మీ పవిత్రమైన తండ్రికి, మహా పతివ్రతయైన తల్లికి జోహారులు!....కాని నాకథ విను. ఇరవయ్యో శతాబ్దంలో, అందులో వేళ్ళు పాతుకుపోయిన విశ్వాసాలను సడలింపచేసిన

(తరువాయి 57 వ పేజీలో)

# అతకని బ్రతుకులు

(8 వ పేజీ తరువాయి)

గాంధీశకంలో, పాశ్చాత్యవిద్య అభ్యసించిన నీవు ఈ నా హృదయావేదన అర్థం చేసుకుంటావనే విశ్వాసంతో చెప్తున్నా, విను.... నేను ఆచారాలు పాతుకపోయిన సంప్రదాయ కుటుంబంలో పాశ్చాత్య విద్య, నాగరికతా వ్యామోహితుడైన తండ్రికి, మూఢవిశ్వాసాలు పేరుకపోయిన విద్యాగంధం ఎరుగని తల్లికి జన్మించాను. మొదటినుండి తండ్రి స్వేచ్ఛనిచ్చి కాలేజి చదువు చెప్పించాడు. అంతేకాదు, మొదటినుండి నాతో విప్లవ అభిప్రాయాలను పోషించాడు.... నాపేరు సుమతి!.... ఆపేరు ఎందుకు పెట్టారో తెలుసా? సుమతి చరిత్ర నీకు తెలుసుననుకుంటా...... మా నాయనమ్మ చిన్నతనంలో సుమతి కథ నాకు చెప్పి ఆమెలా మహాపతివ్రతవు కమ్మని దీవించి నప్పుడు మరీ చిన్నతనంలో ఆమెలా నాభర్తకు ఆత్మార్పణం చేస్తాననుకున్నా. కానీ, రోజులు గడిచీ, ఈ మగవారి లోకంలో, మగవారు అల్లిన కథలను వింటూ మగవారికి బానిస కావటంలోనే ఉందా పాతివ్రత్యం అనుకున్నా...... మన పురాణాలలో సర్వం అర్పించి కోరరాని కోర్కె కోరినా భర్తకు తీర్చటానికి అంగీకరించిన సుమతి ఉంది. చివరకు ఆమె తన పాతివ్రత్యాన్ని నిలుపుకోడానికి లోకాన్నే స్తంభింపచేసినట్లుంది..... కాని అలా భార్య కోరరాని కోరిక తీర్చిన మగవాడు ఉన్నాడా? కోరిక తీర్చటం అలా ఉంచు. తన్నే నమ్మిన భార్యను మన్నించాడా శ్రీరాముడు? భారత దేశంలో కానవచ్చే ఈ పతివ్రతలు ప్రపంచంలో మరి ఎచ్చటా కానరాగేం?..... ఇలాంటి విప్లవ బీజాలతో పెరిగింది నా చిన్ననాటి జీవితం....కాని ఇన్ని విప్లవ అభిప్రాయాలకు మూలమైన నా తండ్రే, సమయం వచ్చేవరకు సంఘంకోసం లొంగిపోయినాడు. తెనుగునాడులో శుద్ధ ఛాందస బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నేను పాశ్చాత్యాభిప్రాయాలతో కాలేజిలో నేర్చిన స్వేచ్ఛతో పంజాబీసింగును ప్రేమించాను. అతడే సర్వం అనుకున్నాను. పెండ్లి చేయమని తండ్రిని కోరినాను.కాని సమయానికి అతనిలో సాహసం లేక పోయింది. కాదన్నాడు. వంశప్రతిష్ఠ వగైరా అన్నాడు. సంఘాన్ని ఎదిరిస్తే బ్రతుకలేమన్నాడు...... అందరు భారత యువతుల్లా పూర్తి భారతీయ సంస్కృతితో నా యవ్వనం, బాల్యం గడిచిఉంటే నాలో ఈ అగ్నిభాండం బద్దలు కాక ఉండేది. ఆ సమయాన నన్నో డాక్టరుకు ఇచ్చి వివాహం చేశాడు. నా హృదయం వ్యతిరేకించింది. కాని స్వతంత్రించి సింగును చేసుకొనే ధైర్యం లేకపోయింది.....

... ఆ డాక్టరుతో నేను గడిపిన మూడు సంవత్సరాలు ఓ స్వప్నంలా ఉన్నాయి. ప్రపంచంలో నాలాటి స్త్రీ ఎలా అరుదో అలాటి పురుషుడూ అరుదే. పగిలిపోయే హృదయంతో, తటస్థపడిన పరిస్థితులకు తలవంచి డాక్టరుతో నిర్లిప్తమైన జీవితాన్ని గడపటానికి సిద్ధమవుతూన్న నాలోని అభిమానాన్ని, పెడసరాన్ని మా పెండ్లినాడు మా నాన్న అన్న మాటలు పైకి తెచ్చాయి ... 'అమ్మడూ, నీలో ఒక ప్రత్యేకత, వ్యక్తిత్వము ఉన్నాయని తెలుసు. అందుకనే విజ్ఞానవంతుడూ, నిన్ను క్షమించి తన విశాల హృదయంలో దాచుకోగల నిమ్ముడూ అయిన ఈడాక్టరును తీసుకవచ్చాను'అని మానాన్న గారు అంటే సహించలేకపోయాను. ఏమిటి నా దోషం? ప్రేమించటమే తప్పా? ... చేయని తప్పిదాన్ని క్షమించే ఈ విశాల హృదయుడెవ్వడూ! ... ద్వేషపూరితమై, అభిమానం దెబ్బతిన్న హృదయంతో నా భర్తకు స్వాగతమిచ్చాను మొదటి రాత్రి ... నిజంగా అందగాడు నా భర్త. కాని ఆ అందంలో హరిణం సౌమ్యత ఉంది కాని, సింగులో నే చూచిన సింహం అందం లేదు. వివేకాన్ని, ముందు జీవితాన్ని మరిచి వారిని కవ్వించి ఏడ్పించాలని అనుకున్నాను. మరి ఒకరికి అర్పించుకున్న నన్ను వివాహం చేసుకున్న నా భర్త పురుషత్వాన్ని సవాలు చేశాను. అంతేకాదు. నన్ను తాకవద్దని, వారంటే పరమ అసహ్యం అని చెప్పాను. ఎదురుతిరిగి నా పీకను నులిమి వేస్తాడని ఆశించిన నా భర్తనుంచి ఒక చిరునవ్వు మాత్రమే లభించింది. బలవంతం చేయటం తన మతం కాదని, నా అంతట నేనే ఆతనిని స్వీకరించేటంతవరకు తనను ముట్టనని అన్నారు ఆ రాత్రి నా భర్త ... నిజంగా వారు తన మాటను నిలబెట్టుకున్నారు. వారి శాంతిస్వభావం, అంతంలేని ఓర్పు నాలో ఉన్న వింత ప్రకృతిని చీకాకుపరిచి పిచ్చిదాన్ని చేశాయి... నా అపూర్వమైన అందం, యవ్వనం చూపి, వారిని కవ్వించి పిల్లి చేతిలో దొరికిన ఎలుకలా వారిని ఆడించసాగాను. కాని వారు లొంగలేదు. నిండు సంవత్సరం ఒకరిని ఒకరం తాకకుండానే గడిచిపోయింది. వారుమాత్రం నిండు ప్రేమతో నన్ను చూసేవారు. కోరిన వన్నీ ఇచ్చేవారు ... నా అందంతో, అభిమానంతో, యవ్వనంతో, ద్వేషంతో వారిని లొంగదీసుకో



ఏమిటది?

చిత్రం—రావాకృష్ణ (ధవళేశ్వరం)

పోలీసులకోసం వెడితే అక్కడ ఎదురుగా గోపీ ఉన్నాడు. "టీచర్, మీరూ, రమా చెప్పినవి గోపీకూడా చెప్తున్నాడు. అంటే ఇది నిజమే అయివుండాలి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

వానలో తడుస్తూ గోపీ గొడుగు ఎగిరిపోతే దానివెంట పరుగెత్తాడు. బిలంముందు నిలబడివున్న యిద్దరు అనుమానంతో అతన్నిపట్టి కట్టేశారు. వారి యజమాని వచ్చేదాకా అట్టేపెట్టారు. భూపతిరాజు గోపీని ఎన్నో రకాల ప్రశ్నించాడు. గోపిచెప్పినది నిజమని తోచింది. "సుబ్బయ్యా, ఈ కుర్రవాడు నిజం చెప్తున్నాడు. పోలీసులంటే లేనిభయం యీ కుర్రవాడంటే ఎందుకు? దారి తెలియకుండా తీసుకుపోయి వదిలిపెట్టేయి" అని అతడు చెప్పడంతో గోపీని తీసుకువచ్చి వదిలి పెట్టేశారు.

గోపీ ఆవిధంగావచ్చి ఊళ్లో పోలీసుల దగ్గరికి వెళ్లాడు.

గోపీమాటలు విన్నాక ఇన్‌స్పెక్టరుగారికి పోయిన నమ్మకం తిరిగివచ్చింది. ఎలాగైనాసరే కొండమీది బిలద్వారం కనిపెట్టాలని పోలీసు బలగంతో తిరిగి బయలుదేరారు.

(సశేషం)

వలెనముకొన్న నేను రాను రానూ నారి అందానికీ, ప్రేమకూ దాసురాలనుకాక తప్పలేదు. కాని నాలో దాగి ఉన్న ద్వేషం, దెబ్బతిన్న అభిమానం అందుకూ నన్ను ఎన్నటికీ క్షమించలేదు ... ఇప్పుడూ, అంటే జీవితాన్ని పూర్తిగా మథించి చూచిన తర్వాత అనాడు ఆ ప్రేమమూర్తికి నన్ను నే అర్పించుకొని, నాలో విజృంభిస్తున్న విషజ్వాలలను అరికట్టి ఉంటే ఈనాడు నాలో ఈ ఆవేదన, అసంతృప్తి, జీవితంమీద ఏవగింపు ఉండేవి కావు... బహుశా నా జీవితం మిగత అందరి స్త్రీలలాగనే చెప్పలేని బాధతో, నెరవేరని ఆశయాలతో ముగిసి ఉండేది. సంఘం కూడ నాలో కుళ్ళును, ఇష్టంలేని సంసార జీవితాన్ని మరిచి నన్ను సాధ్వి అని పిలిచి ఉండేది... కాని మూడు సంవత్సరాలు ముగియకముందే తలవనితలంపుగా సింగు తటస్థపడ్డాడు. ఏదో పని కల్పించుకొని నా భర్తవద్దకు రాసాగాడు. అంతవరకూ నాలో దాగి ఉన్న శక్తులన్నీ విజృంభించాయి. నాలోని నిర్లిప్తత అంతరించింది. ఒక రోజు ఎవ్వరికీ తెలియకుండా సింగుతో ఇచ్చటికి వచ్చేశాను. అప్పటికే సింగుకు ఇచ్చట ఈ పెద్ద వ్యాపారం ఉంది... మొదటి రోజులు సింగుతో ఎంతో ఆనందంగా గడిచిపోయాయి. కాని, ఆ రోజులు అన్నీ కలిపి పది ఉంటాయో లేదో! బహుశా నా జీవితానికంతా అవే సర్వాన్ని మరిచి అనుభవించిన రోజులు... ఎంతో ప్రేమతో, అణిచిపెట్టబడిన ఉద్రేకంతో, సర్వం తానే అని సింగు వద్దకు వచ్చాను. కాని, ఆ కొద్ది రోజులలోనే సింగులో మానవత్వంకన్న పశుత్వమే ఎక్కువగా ఉందని, ప్రేమకంటే కామమే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉందని తెలుసుకున్నాను. కాలేజిలో చదివే రోజులలో నామీద ఉన్న గౌరవం మాయమయింది. బొంబాయి వచ్చిన కొద్ది రోజులలోనే సింగును నన్ను వివాహం చేసుకొమ్మని కోరాను. కొన్నాళ్ళు చట్టం ఒప్పుకోదని, కొన్ని రోజులు వివాహం లేకుంటే ఏం అని, మరి కొన్నాళ్ళు మౌనం వహించి దాటవేశాడు. రోజులు జరిగేకొలదీ నాలో భయం పట్టుకుంది. ప్రేమించిన వ్యక్తితో క్రమబద్ధమైన జీవితాన్ని గడుపుదామని వచ్చిన నా ఆశలు అడియాసలు అయ్యాయి. నామీద మోజు తగ్గగానే నా బ్రతుకు బజారు బ్రతుకేనా అనిపించింది. ఆ భయం నాలోని సహనాన్ని కోల్పోయేటట్టు చేసింది. సింగుకు శాంతి లేకుండా చేశాను.. చివరకు ఆతడు సహనాన్ని కోల్పోయి ఒక రోజు అనరాని మాటలు అన్నాడు... నా దివ్యసుందర విగ్రహంతో ముగ్ధుడయినంతవరకూ ఆతనిలోని పశుకామానికి సర్వం నేనే!... మరుక్షణం నేను ఆతనికి ఏమీ కాను. ప్రేమించమనీ, భార్యగా స్వీకరించమనీ ప్రాధేయపడిన నన్ను ఒకనాడు నేను కుక్క ముట్టిన కుండననీ, నాలో పవిత్రత ఏనాడో నశించిందనీ, నాలాటి స్త్రీ భార్యగా పనికిరాదనీ అన్నాడు... ఆ క్షణంలో నా కళ్ళు

# అతకని బ్రతుకులు

తెరుచుకున్నాయి. మగవాడు నిర్మించిన ఈ లోకంలో పవిత్రతను నాశనం చేయడానికి ఏ మగవాడు ప్రయత్నించుతాడో ఆ మగవాని దృష్టిలోకూడ ఆ స్త్రీకి గౌరవం ఉండదనీ, ప్రేమ అనే దానిని వివాహం క్రమబద్ధం చేయకపోతే స్త్రీ పతనమవుతుందనీ తెలుసుకున్నాను. స్త్రీకి సమానత్వం ఇస్తున్నామని డాబులు పలుకుతున్నా అది నిత్యజీవితంలో సున్ననీ, ఇప్పటికి సింగు ఎన్నోమారులు కుక్క ముట్టిన కుండ అయినా ఆతనిలో అపవిత్రతను ఈ మగ నిర్మితం అయిన లోకం మన్నిస్తుందనీ అనుకున్నాను. ఆ రోజే నాలో ఉన్న ప్రేమ యావత్తు ద్వేషంగా మారింది... ఒక్క సింగుమీదనే కాదు. యావత్తు ప్రపంచంమీద కూడ... పవిత్రతకు, అపవిత్రతకు మధ్య ఉన్న పొర చాలా సున్నితమయింది. అది అలా ఉన్నంతవరకు పశుబలంతో హద్దులు ఏర్పరిచిన పురుష సంఘం స్త్రీని గౌరవిస్తుంది. పతనమైతే ఈ హిందూ సంఘంలో మరి గతులు లేవు. క్షమించటం ఎరుగదు. ఏం చేయాలి? ... అప్పటికీ నేను నా భర్తవద్దకు వెళ్ళి క్షమించమని అడిగితే నామీద మోజు తరగని నా భర్త నన్ను క్షమించి విశాల హృదయాన్ని రుజువు చేసుకొనేవాడు. కాని జీవితంమీద ఏర్పడ్డ అసక్తి, పురుషలోకంమీద ద్వేషం, నాలో విద్రాణమైన జీవితస్రవంతి ఆ పని చేయనీయలేదు... నాలోని మమత నరకబడింది... నాకు చివరకు మిగిలింది ఈ అందమయిన శరీరం! అదే అందరికి కావలసింది... వన్నెలు పెట్టేకొలది అది పెరుగుతుంది. ఆ నగ్నసత్యం తెలిసిననాటి నుంచి దానితోనే సింగును బానిసను చేసుకున్నా... నా జీవితాన్ని నాశనంచేసిన అతనికి జీవితంలో శాంతి లేకుండా చేశాను... పది సంవత్సరాలు స్వచ్ఛందజీవితం! అదే జీవించటం అనుకున్నా. చివరకు జీవించటమే వ్యసనంగా మారింది నాలో. లేకుంటే నాలో జనించిన ద్వేషం, దుర్వ్యసనాలపై వ్యామోహం నన్ను ఏనాడో దహించివేసి ఉండేవి!

సింగు అకస్మాత్తుగా మరణించాడు. అంతవరకూ చూచీ చూడని లోకం సింగు మరణాన్ని నా నెత్తిన రుద్దటానికి ప్రయత్నించింది. ఉన్న ఒక్క ఆధారం పోయి విలపిస్తూ ఉన్న నామీద సానుభూతి చూపటానికి బదులు నాలో లేని లోపాలు చూపసాగింది లోకం. దానితో నాలో ఉన్న ద్వేషం సంఘంమీద తిరుగబడేలా చేసింది. నామీద సానుభూతి లేని ఈ లోకంమీద నాకు సానుభూతి ఎందుకు? కావలసినంత ధనం ఉంది. రోజు రోజుకూ వన్నెదిరుగుతున్న శరీరం ఉంది... అంతవరకు సింగుకు ద్రోహం చేయని నేను నా ధనంతో, అధికారంతో స్వేచ్ఛాజీవితం సాగించాను. లోకం నానడవడి తెలిసినా ఏమీ చేయలేకపోయింది. కానీ, రోజులు జరిగేకొలది నా జీవితంలో ఏదో తీరని లోటు కానరాసాగింది. ద్వేషించి ఏమీ సాధించలేమనుకున్నాను... కాని ఎవ్వరిని ప్రేమించేది?... నాలాంటిదాన్ని ఎవ్వరు సహిస్తారు చెప్పు... చివరకు అమ్మా అని పిలిపించుకొనే దిక్కు కూడ లేనిదాన్ని. ఇంత బంగాళా ఉంది. ఆస్తి ఉంది... కాని సహించరాని ఒంటరితనం మిగిలింది...

చెప్పు బాబూ. నాకు నిష్కృతి లేదా? ... నిన్ను చూచిన తర్వాత నాలో శిథిలించిన జీవితం మేల్కొనింది. నాలో అంతవరకూ ఈ లోకం మీద ఉన్న ద్వేషం చల్లారింది... నాకో కొమారుడు కావాలి... నీవే నా కొమారుడవు! నేను నిన్ను ఏమీ కోరను. పుత్రప్రేమను ఇవ్వు. అంతకుమించి ఏమీ కోరను. ఇంతవరకూ ప్రతిసారీ నేను ఆశించిన ఆశయాలన్నీ దగ్ధమవుతూ, నాలోని ప్రేమ హృదయాన్ని దహించివేసి ప్రతిసారి నిరాశతో ద్వేషాన్ని పెంచాయి. నేను కోరింది ఏమీ జరుగలేదు. ఈ జీవితంలో అసంతృప్తి, అంతులేని ఆవేదన మిగిలాయి. జీవితంలో తారసపడిన ప్రతి వ్యక్తిలా నన్ను తిరస్కరించి ప్రేమలేదని, ఈ లోకంలో ద్వేషించడమే నా రాత అని నన్ను తోసివేసిపోతావా? ... లేదా నన్ను ఆదరించి నీ తల్లిలా స్వీకరించి లోకంలో ఇంకా కొంత మంచి మిగిలి ఉందని రుజువు చేస్తావా? ఇంక సహించలేను. నాలో అగ్నిపర్వతాలు ప్రేలాయి. నీ తిరస్కారంతో జీవితం అంతం చేసుకోనా...'' ఆతని రెండు చేతులూ పట్టుకొని, ఆ దోసిట్లో ముఖం దాచుకొని సుమతీదేవి విలపించసాగింది. ఆత్మకథ చెప్పుతూ ఉన్నంతవరకూ, కన్నీరు ప్రవాహం కారుతున్నా నిలుపుకోగలిగిన దుఃఖం సుమతీదేవికి మరి ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

అనుకొనని ఈ సంఘటనతో మూర్తి నిశ్చేష్టుడయ్యాడు. ఆమెను ఎలా ఓదార్చాలో అతనికి తెలియటంలేదు. ఆమె వెనుక అంతటి చరిత్ర ఉందనికానీ, నిత్యానందవతిగా కన్పించే సుమతీదేవి హృదయంలో అంతటి అగ్నిపర్వతం ఉందనికానీ మూర్తికి తెలీదు. అంతవరకూ నిల్చొని ఉన్నవాడల్లా, తన చేతుల్లో తల దాచి విలపిస్తున్న సుమతీదేవిని నెమ్మదిగా నడిపించి తీసుకవెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టి ఆమె హృదయంలో మండి పొంగి పొరలివస్తున్న దుఃఖాన్ని చూస్తూ కూర్చున్నాడు. అంతకంటే వేరే చేయటం అతనికి తోచలేదు. పది నిమిషాలలో ఆమె ఎంతో కష్టంమీద దుఃఖాన్ని ఆపుకోగలిగింది. ఆతనికి సన్నిహితంగా జరిగి, రెండు చేతులూ పట్టుకొని ''నన్ను ఇలా సముద్రంలో వదలిపోవు కదూ? ... నీకు తల్లి లేదన్నావు. ఈ రోజునుంచి నీకు తల్లిని నేనే. బహుశా నీవు ఊహించిన విధంగా పరమ

పవిత్రురాలను కాకపోవచ్చు. కాని నాలో మాతృ హృదయం ఉందని తెలియచేస్తే ... నన్ను అనాథను చేయకు ...'' అనేవరకు మరల దుఃఖం వచ్చింది.

''మీరు చాలా ఉద్రేకంలో ఉన్నారు. ఈ పరిస్థితులలో ఏమీ మాట్లాడలేరు. రేపు మరల కలుస్తాను ... ఆలోచించుకోండి.''

''ఆలోచనకు ఏమీ లేదు. నీవు నా కుమారుడివి... ఒక్కసారి అమ్మా అని పిలువు. చాలు. ఈ అనంత భాగ్యం నీదే...''

మూర్తి పెదవులమీద ఒక చిరునవ్వు ఉదయించింది. ఈ దుఃఖంలో ఆమె ఏమి సాహసం చేస్తుందో అనే భయంతో ఏమీ అనలేకపోయాడు. కాని అమ్మా అని పిలవడానికి అతని అంతఃకరణ అంగీకరించటంలేదు.

అతని తడబాటును గమనించగానే ఆమె మనస్సు చివుక్కుమంది. ''అవును బాబూ. యీ పాపిని, పతితురాలిని, చరిత్రహీనురాలిని అమ్మా అని పిలవడానికి సంకోచిస్తున్నావు. కాని ఈ లోకంలో పశ్చాత్తాపపడ్డ హృదయాన్ని మీ తండ్రిలాంటి ఉదార హృదయంలో జన్మించిన నీకు యీ రోజు కాకపోయినా మరో నాడయినా క్షమించగలవని నాకు తెలును ... ఇప్పుడు వద్దు. ఆ రోజే అమ్మా అని పిలుద్దువు గానీలే... కాని ప్రస్తుతం నానుండి పారిపోననీ, ఆఫీసులో పని చేస్తాననీ మాట ఇవ్వు...'' ఆమె చేయి చాపింది.

ఆ దీనురాలి ముఖం చూస్తూ మూర్తి కాదనలేకపోయాడు. నెమ్మదిగా ఆమె చేతిలో చేయి వేస్తూ ''అలాగే'' అన్నాడు.

ఆమె మరి అచ్చట నిల్వలేకపోయింది. గబగబా లోనికి పోయింది. మూర్తి ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి నెమ్మదిగా మేడదిగి పోయాడు.

## 4

మరునాడు అప్పుడే కారు దిగి, ఆఫీసులో కాలుపెట్టిన సుమతీదేవిని కావలామనిషే గుర్తుపట్టలేకపోయాడు. ఆ కంటి అద్దాలు, ఫేసు పౌడరు, లిప్‌స్టిక్ లేవు. ముదురు ఎరుపు రంగు కంచి పట్టుచీర దేహమంతా కప్పుతూ ఉండగా, పేటు రవికె మోచేతులు దిగి ఉండగా, మెడలో సన్నని గొలుసూ, రెండు చేతులనిండా గాజులు, వచ్చటి ముఖంపై పెద్ద కుంకుమ బొట్టు, జర్మాముడి వేసుకున్న జుట్టులో సగంకన్నా ఎక్కువ ఉన్న తెల్లటి వెంట్రుకలు — నడివయస్సు దాటిపోతున్న స్త్రీయే సుమతీదేవియే అని గుర్తుపట్టక పోవటంలో ఆశ్చర్యం లేదు. ఆశ్చర్యంతో తనకు నమస్కారం చేస్తున్న ఆఫీసు బృందానికంతా చిరునగవుతో ప్రతినమస్కారం చేస్తూ లోనికి వెళ్ళింది. ఇంతవరకూ ఆమె ముఖంలో ఉన్న ద్వేషం, దర్పం పోయి, కరుణ, వినమ్రత కాన వచ్చాయి. ఆఫీసు మధ్యలో నిల్చున్న ఆమె కళ్ళు దేనినో వెదుక నారంభించాయి. ఆ కళ్ళలో ఆవేదన కానరాసాగింది.

అప్పుడే ఆఫీసులోకి వచ్చిన మూర్తి ఆమెను చూచి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. నెమ్మదిగా ఆమె వద్దకు వచ్చి నమస్కారం చేశాడు. తెల్లని పాంటూ, తెల్లని బుష్‌షర్టూ వేసుకొని ఉన్న అతనిని చూడగానే ఆమె కళ్ళు రెండూ తృప్తితో మెరశాయి.

''రా. బాబూ... పి. ఎ. గారూ, స్టాఫ్‌నంతా ఒకసారి నా ఆఫీసురూములోకి రమ్మనమనండి'' అంటూ ఆమె గదిలోకి వెళ్ళింది. మూర్తి ఆమెను మెల్లగా అనుసరించాడు.

పది నిమిషాలలో ఆమె గది అంతా ఆఫీసు స్టాఫ్‌తో నిండిపోయింది. ఆమె అలా నిల్చునే ఉంది. అందరూ చేరగానే ''నేను పెద్దదాన్ని అయిపోతున్నాను. ఈ ఆఫీసు భారాన్ని మోయలేను. ఈ రోజునుంచి మా బాబు మూర్తి ఆధిపత్యం వహిస్తాడు. మీరంతా బాబును ఆప్యాయంగా చూసుకుంటారనుకుంటాను'' అని సుమతీదేవి అన్నది. ఎవ్వరి నోట మాట రాలేదు. ఆశ్చర్యంతో చూస్తున్నారు. మూర్తి పని మరి అయోమయంగా ఉంది.

''ఇవిగో బాబూ తాళంచేతులు... ఆఫీసు నిర్వహించుకో. నా ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. నేను ఆఫీసుకు రాలేను. అవసరం ఉన్నప్పుడు ఇంటికి వచ్చి సలహా తీసుకో'' అని, సుమతీదేవి తాళంచేతులు ఇవ్వబోయింది. మూర్తి నోట మాట రాక అచేతనంగా ఆమె చేతిలోని తాళంచేతుల గుత్తి తీసుకొన్నాడు. ఆమె కళ్ళు రెండూ తృప్తితో నిండుకున్నాయి. తాళంచేతులు మూర్తి చేతుల్లో పెట్టి, ఒక్కసారి అందరికి రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెట్టి గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయింది సుమతీదేవి.

అచేతనుడై, అన్యమనస్కుడై చేతిలో తాళంచెవులగుత్తిని పరికిస్తున్న మూర్తి వద్దకు నారాయణ వచ్చి, అతని భుజంమీద చేయివేసి ''అసాధ్యుడివిరా, మూర్తీ. పాషాణాన్నే కరిగించావు... ఇకమీదట మా అందరికి బాసువు కదా!... కంగ్రాచులేషన్స్'' అని కరస్పర్శ చేసి వెళ్ళాడు. స్వప్నలోకం నుంచి తేరుకున్న ఆఫీసు బృందమంతా ఒక్కొక్కరే వచ్చి మూర్తితో కరస్పర్శ చేసి అభినందించి పోసాగారు. మూర్తి థాంక్సు చెప్పుతున్నాడేగాని అతనిలో ఉత్సాహం లేదు. ఎలాటి అమ్మ ఈమె?

## 5

రాత్రి పది గంటలు కావస్తుంది. నర్సింగు హోములో అంతా నిశ్శబ్దంగా ఉంది. స్పెషలు రూములో మంచంమీద మూర్తి అప్పటికి రెండు రోజులనుండి స్పృహలేకుండా పడి ఉన్నాడు. సుమతీదేవి అతని మంచంవద్ద ఎంతో ఆతురతతో కూర్చొని మసకవెలుతురులో మూర్తి

మీకు తెలుసా

## జవాబులు

1. ఆస్ట్రేలియా దేశంలోని 'డక్‌బిల్' ప్లాటాపస్.

2. అక్కడ కాలంలేదు.

3. గెర్‌ట్రూడ్ ఈడర్లే; 1926 లో.

4. బంతి చుట్టుకొలత అంతదూరం—అంటే 28 అంగుళాలు.

5. ఈజిప్టులో.

6. కెనడా.

వెల్ష్, గాలిక్, ఐర్స్, మారిక్స్, ఫ్రెంచి, కార్నిష్ భాషలు.

8. పోర్ట్‌లాండ్‌లో దొరికే సిమెంటురాయి రంగు ఉన్న కారణంచేత. ★

ముఖం వైపు చూస్తూ ఉంది. ఆ ముఖంలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తప్ప మరి ఏమీ మార్పులు లేవు. ప్రతి పావుగంటకు డాక్టరు వచ్చి పోతున్నా ఆమెకు ఆతురత ఆగలేదు. నిస్పృహతో కండ్లు మూసుకొని దేవుని స్మరించుకుంటూ ఉన్నదల్లా పాదాలసవ్వడి విని తలుపు వైపు చూసి నివ్వెరపోయింది. గుమ్మంలో తన వైపు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి ఉన్నాడు మూర్తి కన్న తండ్రి పుండరీకాక్షయ్య. ఆమెకు నోట మాట రాలేదు. నిలవ్వటానికి ప్రయత్నించి విఫలురాలయింది.

''శివా, సుమూ!'' పుండరీకాక్షయ్య ఒక్క అడుగు ముందుకు వేశాడు.

జారిపోతున్న శక్తిని కూడదీసుకొని సుమతీదేవి లేచి నిల్చొని శబ్దం చేయవద్దని సైగ చేస్తూ అతని సమీపానికి వెళ్ళింది.

''బాబు ఎలా ఉన్నాడు?''

''రెండు రోజులనుంచి స్మైకంలో ఉన్నాడు... మాటలు లేవు. చేయవలసిన వైద్యమంతా చేస్తున్నారు. ఎప్పటికి వెళ్ళినా నన్ను దురదృష్టం వెంటాడుతూ ఉంది. నెలం పసికందును మీకు వదిలి, వ్యామోహంలో పడి వచ్చాను. దేవుడు పంపగా వచ్చినట్లు ఉద్యోగం కోసం నా వద్దకే వచ్చాడు... వెంటనే మూర్తిని నా కన్నకొడుకుగా గుర్తించాను. సర్వం త్యజించి అయినా మూర్తిని దక్కించుకోదలచుకున్నాను. కాని వాని ధర్మనిష్ఠను చిన్న తర్వాత తల్లిని అని

చెప్పుకొనే ధైర్యం లేకపోయింది. . ఎంతో ప్రాధేయపడ్డ తర్వాత నన్ను ప్రేమతో చూడక పోయినా కసరుకోవటం మానుకున్నాడు. . ఈ ఆరు నెలలలోకే ఇలా జబ్బు చేసింది. పాపిసి దాన్ని... నా పాదం సోకితే చాలు మీకు అన్యాయమే కలుగుతుంది... మిమ్మల్ని క్షమించ మని కోరటానికి...'' దుఃఖంతో మరి మాట రాలేదు.

''ఇలాంటిది ఏదో సంభవించి ఉండాలి అని బాబు జాబులనుండి ఊహించుకున్నాను. దారిన పోయే పతిత స్త్రీ బాబుమీద ఇలాంటి అవాజ్యానురాగం చూపిస్తుందంటే నమ్మలేక పోయాను... ఏలాట ప్రళయం రాకుండా బాబును ఎలా దక్కించుకోవటమా అని సతమతమవుతూ ఉంటే బాబుకు ప్రమాదకరంగా ఉంది రమ్మని నారాయణ ఇచ్చిన టెలిగ్రాంతో వెంటనే రావలసివచ్చింది... ఇంతవరకూ నీ...''

''మంచి పనే చేశారు. వానితో నేను చని పోయిందని చెప్పటమే మంచిదయింది. చివరకు చుట్టుపక్కలవారు వానితో చెప్పి తల్లి లేచి పోయిందని పరిహసించకుండా పుట్టి పెరిగిన దేశమే వదిలి మారుమూల చేరారు... అంతే కాదు... వానికి అతని తల్లినయిన నేను లేచి పోయినదాన్ని అని, పతితనని తెలియకుండా, తన తల్లి మహాపతివ్రత అని, పూజ్యురాలని పెంచారు. మీకు కృతజ్ఞురాలిని. కాని —''

''పూర్తి చేయి, సుమూ! బ్రతికి ఉన్న నిన్ను చంపి, నీ పుత్రుని హృదయంలో నీమీద ప్రేమ లేకుండా చేసినందుకు నన్ను ఎంతయినా నిందించు. కాని నీనీడ చిన్నవానిని వెంటాడనిచ్చి వాని జీవితం దుఃఖమయం చేయలేకపోయాను.....''

''క్షమించండి. మీరు చేసింది మంచిది కాదని నేను అనటం లేదు. కాని మాతృప్రేమకు తపించి పోతూ ఉన్న మూర్తి జీవితానికి నేను కాకపోయినా, మీరు మరల ఇంకొక స్త్రీని వివాహమాడి అయినా మాతృప్రేమను ప్రసాదించవలసింది. స్త్రీ పెంపకంలేక మీ వైదిక ప్రవృత్తిలో పెరిగిన బాబు నిష్కగరిష్ఠుడు, దయావిహీనుడు అయినాడు.....''

''ఇక చాలించు, సుమూ! నీ సాంగత్యంచేసిన పురుషుడెవ్వడూ ఈ లోకంలో మరో స్త్రీని చూడలేడు!.... అందుకే మరల వివాహం చేసు కోలేకపోయాను. అందువల్ల బాబు పెంపకంలో దురదృష్టం జరిగి ఉంటే.......''

మంచంమీద మూర్తి చిన్నగా మూలిగాడు. వెంటనే అతడిని కన్న ఆ యిద్దరూ వాని మంచం వద్దకు ఆతురతతో వచ్చారు. విభిన్నదృక్పథాలు, ప్రత్యేక వ్యక్తిత్వంగల ఆ ఇద్దరిని వివాహబంధం కూడ కలిసి పయనించలేకుండా చేసింది. చివరకు అనుభవాలు ఉద్రేకాలను చల్లార్చగా తాము కన్న సంతానంకోసం ఇద్దరూ ఆర్ద్రహృదయంతో అతనివద్దకు వచ్చారు. అతని భవిష్యత్తుకోసం మరువరాని తప్పిదాన్ని కూడ క్షమించదలచాడు

# అతకని బ్రతుకులు

పుండరీకాక్షయ్య.

అతడు మూర్తిచేతిని చేతిలోకి తీసుకొని ''బాబూ'' అన్నాడు.

అతడు కండ్లు తెరిచి సూటిగా తండ్రి ముఖంలోకి చూసి ''నాన్నా!.....'' అని మరల కన్నులు మూసుకున్నాడు. పక్కన ఉన్న ఆమె వైపు చూడనేలేదు. ఆమె హృదయం బ్రద్దలు అయి పోయింది. పదినిమిషాలు ఉన్నా మూర్తి మరల కన్నులు తెరువలేదు. కదలలేదు. కాని అతని ముఖం ఆవేదనతో కుమిలిపోతున్నట్లుగా ఉంది. ఇంతవరకూ ఉన్న ప్రశాంతత లేదు. ఆమె ఓక్షణంసేపు జబ్బుతో పాలిపోయి ఉన్న కన్నకుమారుని ముఖంవైపు నిశితంగా చూసి, ఏదో నిర్ధారణకు వచ్చిన దానిలా భర్తను చేయి పట్టుకొని దూరంగా తీసుకొని వెళ్ళింది.

''మీతో ఒక్కమాట చెప్పుతాను, వినండి. బాబు నన్ను ఏనాడు క్షమించలేడు. అందుకు నేను వాడిని నిందించను. చేసుకున్నవారికి చేసుకున్నంత ఫలం. మనమాటలు విన్నట్లుగా ఉంది. ఇంత వరకూ మీవద్ద సుఖవంతంగా గడిచిన జీవితం ఇక దుఃఖమయం కావటం సహించను. ఇంత వరకూ..... నాకోసం నేను జీవించాను. మరొకరికోసం క్షణమంత కూడ ఇవ్వలేదు. కాని నాకన్న కుమారునికి సర్వం ఇచ్చి అయినా వాని జీవితం సుఖమయం చేయాలని ఉంది. నేను ఉన్నంతవరకూ వాడు సుఖపడడు. ఇంతవరకూ ఎవ్వరి ఆధారం లేకుండానే జీవించాను. ఇకముందు కూడ అలానే జరుగనీయండి.... కావలసినంత ఐశ్వర్యం ఉంది. ఏనాడో అదంతా అబ్బాయిపేర వ్రాశాను. నన్ను మరిచిపోయి సుఖంగా జీవించండి. ఏనాడైనా నా తప్పులను మన్నించ...... గలిగితే..... వాణ్ణి... నాకో... పిండం....వదల మనండి.'' మరి ఆమె మాట్లాడలేకపోయింది.

అతని హృదయం ఆమె ఆవేదనచూచి ద్రవీభూతం అయింది. ''చూడు, సుమూ!....అపోహ పడుతున్నావు. రెండు రోజుల నుంచి మైకంలో ఉన్నవాడు మన మాటలు వినలేడు. విన్నా అర్థం చేసుకోలేడు. నీవు పారిపోవనవసరం లేదు. ఇంత వరకూ నీవు కన్నతల్లివని బాబు యెరుగడు. ఇకముందుకూడ అలానే జరుగనీ.... ఇంతవరకూ మన సంసారం ఛిన్నాభిన్నమయింది. నిన్ను ఏ క్షణంలో చూశానో ఆనాడే నీకు అర్పించు కున్నాను. అది లగాయతు సుఖమంటే యేమో ఎరుగను..... ఈ చివరి రోజులలోనైనా నన్ను కొంత సుఖపడనీ.... నీసాన్నిధ్యం తప్ప ఏమీ కోరను. బాబుకు పెంపుడు తల్లిగానే ఉండిపో. ఈరహస్యం ఏనాడూ బాబుకు తెలియనవసరం లేదు......''

అతని మాటలు వినగానే ఆమె నివ్వెర పోయింది. ఇన్నాళ్ళు తన దుశ్చరిత్ర, రంపపుకోత, ద్వేషం కూడ మనస్సును మార్చని మమతకల ఈ మానవుని ఏమనాలి?.... ఆమె జవాబు చెప్పకుండా మూర్తి దగ్గర ఉన్న కుర్చీలో కూర్చుంది. అతడు కూడ వచ్చి ఆమె ప్రక్కనే నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

రాత్రి పన్నెండు గంటలయింది. మూర్తిలో చలనంలేదు. వారిద్దరు ఎప్పుడు నిద్రపోయారో వారికే తెలీదు.

* * *

గడియారం ఆరుగంటలు కొట్టింది. ఆమె ఉలిక్కిపడి లేచింది. కిటికీలోగుండా ఉదయించబోతున్న సూర్యుని వెలుతురు వస్తూంది. ప్రక్కన అతడు కూర్చునే నిద్రపోతున్నాడు. ఆమె మంచం వైపు చూసింది. మూర్తి అచ్చట లేడు. ఆమె హడలిపోయి భర్తను కుదిపి లేపుతూ ''బాబు యేడండి?''అని గాబరాగా అరచింది. ఆ అరపుతో అతడు లేచి నిద్రాని కళ్ళు నులుపుకున్నాడు. చుట్టూ అంతాచేరి రోగి ఎక్కడ అంటే ఎక్కడ అన్నారు. అతడు ఎక్కడాలేడు.

మంచంమీద కాగితం ఒకటి గాలికి రెపరెప లాడుతూంది. ఆతురతతో తీసి చూసింది.అది మూర్తి చేతివ్రాత.

''అమ్మా!

ఎన్నోసార్లు నన్ను అమ్మా అని పిల్వమన్నావు. పిల్వలేక పోయాను. రాత్రి అంతా విన్నాక, నీ కడుపున పుట్టినందుకు నిన్ను ఈదినం అమ్మా అని పిలుస్తున్నాను. ఆనందించు.

నీస్వార్థంకోసం నెలల పిల్లవాడినయిన నన్ను నిర్దయగా వదిలివెళ్ళావు. అటువంటి పరిస్థితుల్లో పుట్టి పెరిగిన వాలో నిర్దయకాక మరి యేముంటుంది? మీరు నా తల్లిదండ్రులు. ఏపరిస్థితుల్లోను మిమ్మల్ని విచారణచేసే దుస్సాహసం నాకు కలుగదు. ఎవరి జీవితాలు వారివి. వాటిని మన యిష్టప్రకారం మలచాలను కోవటం భ్రమ!

నాన్నగారు పెద్దవారయినారు. నాకోసం సర్వం అర్పించిన త్యాగమూర్తివారు. నీ సాన్నిధ్యంలో ఉన్నంత సౌఖ్యం వారికి మరెచ్చటా లభించదు. కాబట్టి ఈ చివరి ఘడియల్లోనయినా వారికి శాంతిని దయచేయువలసినదిగా కోరుతున్నాను.

నిజం తెలుసుకున్న నేను మీమధ్య ఉండ లేను.... నా పెంపకం అలాంటిది. అందుకు మిమ్మల్ని నిందించను. .. ఈ ప్రపంచం అతి విశాలమయింది. నాకు వయస్సూ, విద్యా ఉన్నాయి. నా బ్రదుకు నన్ను బ్రతకనీ........

సెలవు,

మీ కొమారుడు, మూర్తి.'' ★

**Printed and Published by S. V. Swamy B.A., on behalf of Andhra Prabha Ltd., and Printed at Dinamani Press, Mount Road, Madras and Published at Gandlapalli, Chittoo. Editor: Neelamraju Venkataseshaiah.**